జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 12-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 191 పేజీలు: 4 వెల: రూ.7




# ట్రాఫికర్!

* రోడ్డునే ఆక్రమించేసిన ప్రైవేట్ ట్రావెలర్స్
* ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిత్యం ట్రాఫిక్ జామ్
* ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
* అక్కడే ఉన్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 11 (వార్త): శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు జిల్లా పోలీస్ బాస్ కేవీ మహేశ్వరరెడ్డి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నా కొందరు ప్రైవేట్ ట్రావెలర్స్ దానికి అడ్డుకట్ట వేస్తున్నారు. రోడ్డుపైనే ప్రైవేట్ బస్సులు నిలిపి ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా, కోర్టు సముదాయం సమీపాన వాహనాలు నిలిపి లగేజీని, ప్రయాణికులను నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కించుకుంటున్నారు. అసలే ఇరుకురోడ్లు దీనికితోడు ప్రధాని రహదారి కావడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనివల్ల అటుఇటూ వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ప్రైవేట్ ట్రావెలర్స్ సిబ్బందిపై గట్టిగా గదమాయించినా వినే పరిస్థితిలో వారు ఉండడం లేదు. ఏం చేస్తారో చేసుకోండన్న తీరు వారిలో కనిపిస్తోంది. ఎవరిని చూసి, ఏం చేసి వారు ఇలా ప్రవర్తిస్తురో అర్థం కావడం లేదని ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ప్రయాణికులు, వాహనచోదకులు అనుకుంటున్నారు.

# దివ్యాంగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని.. టోకరా!




* ఉద్యోగాలిప్పిస్తానని రూ.18లక్షలు నొక్కేసిన మహిళ
* లబోదిబోమంటున్న నిరుద్యోగులు
* ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు
* న్యాయం చేయాలంటున్న పేద దంపతులు

సంతబొమ్మాళి, డిసెంబర్ 11 (వార్త): మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తాను.. స్వప్రయోజకులు చేస్తాను.. ఇక మీరు హాయిగా ఉండొచ్చు.. అని టెక్కలికి చెందిన ఓ మహిళ ఓ నిరుపేద కుటుంబానికి మోసం చేసి విడతల వారీగా సుమారు 18లక్షలు కాజేసిన వైనం వెలుగుచూసింది.

వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళికి చెందిన భార్యభర్తలు సన్యాసమ్మ, అప్పన్నలు ఊరూరా తిరుగుతూ గాజులు, పూసలు అమ్ముతుంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. వీరు దివ్యాంగులు. ఈ దంపతులు టెక్కలిలో గాజులు, పూసలు అమ్ముతున్న సమయంలో టెక్కలికి చెందిన గోపిదలై దమయంతితో పరిచయం ఏర్పడింది. చనువు పెరుగడంతో వారు తమ కుటుంబ పరిస్థితులను ఆమె వద్ద వినిపించారు. దీంతో ఆమె వారికి మాయమాటలు చెప్పి నాకు చాలామంది పెద్దలతో పరిచయం ఉందని, వికలాంగులైన మీ ఇద్దరు పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికింది. దీనికోసం కొంత ఖర్చు అవుతుందని ఈ దంపతులతో చెప్పింది. వికలాంగులైన తమ కుమారుడు, కుమార్తెకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో పలుమార్లు ప్రాంశరీ నోటు మీద సంతకాలు తీసుకుని 18 లక్షల 60 వేల రూపాయలు దమయంతికి ఇచ్చారు. ఏళ్లు గడచిపోతున్నా ఉద్యోగాలు రాకపోవడంతో పలుమార్లు దమయంతిని వారు అడగ్గా ఇదిగో అదిగో ఉద్యోగం అంటూ ఏదో ఒక సమాధానం చెబుతూ దాట వేసేది. దీంతో ఆ దంపతులకు అనుమానం రావడంతో తామిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశారు. దీంతో ఆమె డబ్బులు ఇచ్చేది లేదని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని అనడంతో ఒక్కసారిగా వారు విస్మయానికి గురయ్యారు.

## మాకు చావే శరణ్యం

మాకు ఇద్దరు వికలాంగులైన పిల్లలు ఉన్నారు. వీరికి ఉద్యోగాలు ఇప్పిస్తామని టెక్కలికి చెందిన దయమంతి నమ్మబలకడంతో విడతలవారీగా రూ.18.60లక్షలు ఇచ్చాం. ఇప్పుడు ఉద్యోగాలు లేవు.. డబ్బులు ఇవ్వనని చెబుతోంది. తమకు జరిగిన అన్యాయాన్ని సంతబొమ్మాళి, టెక్కలి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చెప్పాం. ఎవరు పట్టించుకోవడంలేదు. దీంతో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాం. మాది పేద కుటుంబం. అప్పుసప్పూ చేసి ఆ డబ్బులను ఆమెకు ఇచ్చాం. ఏం చేయాలో తెలియడం లేదు. మా డబ్బులు మాకు ఇవ్వకపోతే చావే శరణ్యం.. అని బాధిత దంపతులు పందిరి అప్పన్న, సన్యాసమ్మ కన్నీరుమున్నీరవుతున్నారు.



## క్రిస్మస్ సంబరాలు


ఇచ్ఛాపురం, డిసెంబర్ 11(వార్త): జిల్లాలో క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఇచ్ఛాపురంలోని యు కాంప్లెక్స్ ఎదురుగా టౌన్ క్రిస్మస్ సంబరాలు బుధవారం రాత్రి ఇచ్ఛాపురం, కవిటి పాస్టర్స్ ఫెలో షిప్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, విశాఖపట్నం బిషప్ కె.ఆర్ సింగ్, జిల్లా అధ్యక్షుడు డి ఎస్ వి ఎస్ కుమార్, జనసేన నాయకుడు దాసరి రాజు, కౌన్సిలర్ ఆసి లీలా రాణి, ఆంధ్రా బాపిస్టు చర్చ్ అధ్యక్షుడు ప్రత్తి విజయ్ కుమా ర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి బుధవారం వైభవంగా కళ్యాణం నిర్వహించారు. మార్గశిర శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగిందని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.



# భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



**పోలాకి, డిసెంబర్ 11 (వార్త):** భూ సమస్యల శాశ్వతపరిష్కారానికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మబగాంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ఈ సదస్సుల ద్వారా 45 రోజుల్లోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో తప్పిదాలు, లోపాలతో రైతులు చాలా రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులు గ్రామీణ ప్రజలకు, రైతులకు గొప్ప సదవకాశామని ఈ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జలుమూరు:** భూసమస్యలన్నీ పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. బుధవారం ఆయన అంధవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వీఆర్వోలు భూముల వివరాలు ఎప్పటికప్పుడు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, రైతులు, కూటమి నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 14న సాగునీటి సంఘాల ఎన్నికలు



**వంగర, డిసెంబర్ 11(వార్త):** వంగర మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. సుదీర్ఘకాలం తర్వాత ఈ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లా అంతటా సాగునీటి ఎన్నికల హడావిడి మొదలైంది. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ సర్కార్ ఈ ఎన్నికల ఊసే ఎత్తలేదు. మండలంలోని ఎనిమిది నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆయా గ్రామాల పాఠశాలల వద్ద ప్రదర్శించారు. వైసీపీ పాలనలో నీటి సంఘాలు నిర్వీర్యం కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటికి ఎన్నికలు నిర్వహించాలని సంకల్పించి ఏర్పాట్లు చేసినా పలు కారణాలతో మూడుసార్లు వాయిదా పడింది. తాజాగా నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా యంత్రాంగం తదనుగుణంగా ఏర్పాట్లు చేసింది. రాజులగుమ్మడ, తలగాం, శివ్వాం, మద్దువలస జలాశయ పథకం, ఇరువాడ కాల్వ, పెదంకలాం, కింజంగి, అరసాడ, కొండచాకరాపల్లి గ్రామాల్లోని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఈనెల 14న ఆయా గ్రామాల పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు అధికారులు సిద్ధం చేశారు.

# మధ్యవర్తిత్వంతో త్వరితగతిన కేసుల పరిష్కారం




**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం 3వ అదనపు జిల్లా జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మధ్యవర్తిత్వంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్య వర్తిత్వంతో ప్రజల సమయం, కోర్టు ఫీజులు ఆదా అవుతాయన్నారు. త్వరితగతిన పరిష్కారం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ఈశ్వరరావు, సెక్రటరీ కె.అన్నంనాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

**రాజాం:** రాజాం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ.. మధ్యవతర్తిత్వం అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సివిల్ వివాదాలు, భార్యాభర్తల తగాదాలో మధ్యవర్తిత్వం ఆవశ్యకత గూర్చి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.






## వైసీపీ నూతన కార్యాలయం ప్రారంభం

**టెక్కలి, డిసెంబర్ 11 (వార్త):** టెక్కలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం ప్రారంభించారు. టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్, తిలక్ మాట్లాడుతూ పార్టీ విజయానికి, జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన పోరాడి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు




**నరసన్నపేట, డిసెంబర్ 11 (వార్త):** బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఇండియన్ బ్యాంక్ నరసన్నపేట బ్రాంచి మేనేజర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధ్యయనం ద్వారా విద్యార్థులకు బ్యాంకు వ్యవహారాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. బ్యాంకింగ్ రంగంలో వస్తోన్న మార్పులు, డిజిటల్ బ్యాంకింగ్, వివిధ రకాల దరఖాస్తులు నింపడం, డిపాజిట్, డబ్బులు బట్వాడా చేయడం, నెఫ్ట్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలను ఏబీఎమ్ బి.గౌతమ్, క్యాషియర్ సాయికుమార్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు.

## ఉత్తమ పోస్టుమాస్టార్‌గా కుమార్




**శ్రీకాకుళం, డిసెంబర్11 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గునుపల్లి గ్రామానికి చెందిన యర్రన్ కుమార్ ఉత్తమ పోస్టుమాస్టర్‌గా ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్ మాస్టర్ కె. ప్రకాష్ చేతుల మీదుగా శ్రీకాకుళం హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## 2 కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 11(వార్త):** గంజాయి సేవిస్తున్న వారిని అరెస్టు చేస్తామని సీఐ మీసాల చిన్నంనాయుడు హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. అలవాట్లు, నడవడిక, ప్రవర్తనపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. గంజాయి అమ్మినా, కొన్నా, సేవించినా అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఇచ్ఛాపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఆరుగురు యువకులను టౌన్ ఎస్ఐ ఈ.చిన్నంనాయుడు అరెస్ట్ చేశారని చెప్పారు. ఎల్ మాక్స్ హాల్ వద్ద 2 కిలోల గంజాయితో పట్టణానికి చెందిన మాడా ఆశిష్, కత్తుల సంతు, కత్తుల అనిల్, కీలు ఢిల్లీశ్వరరావు, తోటూరుకి చెందిన మునకాల శ్యాం, ఒడిశా కె.సువానినకు చెందిన బోర శ్యాంలను అరెస్టు చేసినట్లు తెలిపారు.



## ఆదిత్యుడిని దర్శించుకున్న చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్



**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని బుధవారం ఉదయం చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ గారు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలను, స్వామి వారి జ్ఞాపికను అందజేశారని ఆలయ ఈవో వై.భద్రాజీ గారు తెలిపారు.



## కేంద్ర మంత్రి గడ్కరీతో ఎమ్మెల్యే శిరీష భేటీ

**పలాస, డిసెంబర్ 11(వార్త):** కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని బుధవారం న్యూఢిల్లీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కలిశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ రహదారుల సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు. ముఖ్యంగా నౌపడ నుంచి బెండి గేట్ రహదారిని రెండు వరుసల రహదారిగా, నరసన్నపేట – ఇచ్ఛాపురం వరకు ఉన్న జాతీయ రహదారి ఆరు లైన్లకు విస్తరణ, సీఎస్పీ రోడ్డు (కళింగపట్నం – శ్రీకాకుళం – పార్వతీపురం), డీఎస్పీ రోడ్డు (డీఎల్ పురం – నరసన్నపేట – మెళియాపుట్టి వయా భావనపాడు పోర్టు) మార్గాలను జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆమె వెంట కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సమన్వయకర్త వెంకన్న చౌదరి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, అమలపాడు మాజీ సర్పంచ్ దున్న షణ్ముఖ రావు, చింత నారాయణ తదితరులు ఉన్నారు.

## అభిమానికి నివాళులర్పించిన దువ్వాడ



**టెక్కలి, డిసెంబర్ 11(వార్త):** టెక్కలి మండలం బూరగాం వాసి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చిరకాల అభిమాని పుచ్చకాయల మోహన్‌రెడ్డి(చిట్టి) బుధవారం ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న దువ్వాడ.. హుటాహుటిన బూరగాం వెళ్లి, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలో పాల్గొని చిట్టి మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. తనతో మోహనరెడ్డి రాజకీయ, వ్యక్తిగత ప్రయాణాన్ని గుర్తు చేసుకొంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మోహన్ రెడ్డి కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు జనపాన తిరుమలరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు జోగారావు, సర్పంచ్ సంజీవ్, యర్రన్నరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

## కార్పొరేషన్ విస్తరణకు కృషి చేయాలి

**పలాస, డిసెంబర్ 11 (వార్త):** ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ విస్తరణకు కృషి చేయాలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. విజయవాడ గుణదలలో గల ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఆఫీస్ నందు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ బుధవారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్ కార్యాచరణ, అజెండాలో పొందుపరిచిన అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో ఉన్న రంగాల్నే కాకుండా మిగతా రంగాల్లో కూడా ప్రవేశించి కార్పొరేషన్ పరిధిని పెంచాలన్నారు. గత మార్చి, ఏప్రిల్‌లో ఎలక్షన్ కోడ్‌తో ఇప్పటివరకు సిమెంట్ సేకరణ చేసి గవర్నమెంట్‌కి సంబంధించిన డిపార్ట్మెంట్‌లకు సబ్సిడీ రేట్లలో అందించలేకపోయామని, కానీ ఇప్పుడు కొత్త గవర్నమెంట్ లో మరికాస్త ముందుకు వెళ్లి ఎక్కువ స్థాయిలో సిమెంట్‌ని సప్లై చేసి కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. కార్పొరేషన్‌ను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ గడ్డం శేఖర్‌బాబు, జీఎం హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 11(వార్త):** ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి స్కూల్‌లో ట్రస్ట్ కార్యదర్శి, సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం గీతా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను ఎంతో రమ్యంగా ఆలపించారు. ఇవి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ విద్యార్థులకు జోహార్ ఖాన్ ప్రత్యేక బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలనాధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, తెలుగు ఉపాధ్యాయులు సంగీతా రాణి, శ్రీనివాసరావు, పీఈటీ కైలాస్ కుమార్‌పండా పాల్గొన్నారు.

**లావేరు:** గుర్రాలపాలెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం గీతా జయంతి వేడుకలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని వాణి మాట్లాడుతూ భగవద్గీత సూచనలను సరిగ్గా పాటిస్తే, జీవితంలో అన్ని బాధలు, చింతల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. మహారాణా ప్రతాప్ సింగ్ హైందవ సేవా సంఘ్ అధ్యక్షుడు సురేష్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు గీతా పారాయణం చేస్తే ఆధ్యాత్మిక భావనలు, నైతిక విలువలు, పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాల కల నెరవేర్చిన మురళి

### - ఎమ్మెల్యే కోండ్రు చొరవతో రెండు నిర్వాసిత గ్రామాల మధ్య ఎట్టకేలకు నూతన రోడ్డు నిర్మాణం



**వంగర, డిసెంబర్ 11 (వార్త):** ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో వంగర మండలంలోని రెండు నిర్వాసిత (కొత్త కాలనీ) గ్రామాల మధ్య రూ.1.08 కోట్ల ఉపాధి హామీ నిధులతో మెటల్ రోడ్డు పనులు బుధవారం మొదలయ్యాయి. దీంతో శ్రీహరిపురం–కింజంగి వాసుల చిరకాల వాంఛ తీరిందని చెప్పాలి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రహదారి ఇబ్బందులు తొలగనున్నాయి. ఇంతవరకూ కింజంగి ఆర్ఆర్ కాలనీకి రోడ్డు లేక మండల కేంద్రానికి లేదా ఎక్కడకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వంగర సుమారుగా ఈ కాలనీతో సహా సుమారుగా 10 గ్రామాల ప్రజలకు రహదారి ఇబ్బందులు తొలగనున్నాయి. 1.7 కిలోమీటర్ల రోడ్డు శ్రీహరిపురం గ్రామంలోని గంగాదొర చెరువు మీదుగా కింజంగి ఆర్అండ్ఆర్ కొత్త కాలనీ మీదుగా కింజంగి గ్రామం వరకు వేయనున్నారు. ఈ రోడ్డు పూర్తయితే కింజంగి ఆర్అండ్ఆర్ కాలనీ వాసులే కాకుండా, కింజంగి, మరువాడ, కొత్తమరువాడ, సీతాదేవిపురం చంద్రంపేట,చౌదరివలస, ఇరువాడ, కోణంగిపాడు తదితర గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పినట్టే.

రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బెజ్జిపురపు త్రినాథ్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర డైరె క్టర్ బలిజిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడు తూ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కృషితో 10 గ్రామాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుందన్నారు. కార్యక్రమంలో కింజంగి, ఆర్అండ్ఆర్ కాలనీ, శ్రీహరిపురం గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఎంజీఆర్

**-రూ.20,000 ఆర్థిక సాయం**

పాతపట్నం, డిసెంబర్ 11(వార్త): పాతపట్నంగల కేఎస్ఎం ప్లాజాలో జరిగిన పాస్టర్ ఫ్యామిలీ ఫెలోషిప్ వేడుకల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. క్రిస్మస్ వేడుకలకు రూ.20,000 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పాస్టర్స్,కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పలాస, డిసెంబర్ 11 (వార్త):** పలాస రైల్వే స్టేషన్ రోడ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి చేతిపై పోల్ల దుర్యోధన, బోరుభద్ర అని రాసి ఉందని, కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. ఆయనను గుర్తించిన వారు 6309990825, 7989386680 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు. మృతుని వివరాలు తమకు తెలియజేయాలని సూచించారు.



# అనధికార లే అవుట్లలో స్థలాలు కొనొద్దు

**పలాస, డిసెంబర్ 11(వార్త):** అనుమతి లేని లే అవుట్లలో ప్రజలు స్థలాలు కొనుగోలు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పలాస, కాశీబుగ్గ పట్టణాల్లోని పూజారి వీధి, న్యూ కాలనీ, గాంధీ నగర్, వివేకానంద కాలనీ, ఉదయపురం, గౌడగాల వీధి, శివాజీనగర్, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుధ్య పరిస్థితిని పరిశీలించి, మెరుగుపరచాలని సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో కట్టడాలు, లే అవుట్లను స్వయంగా సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంట పట్టణాలలో స్థలాలను కొనుగోలు చేసేముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ యాక్ట్ ప్రకారం అన్ని అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలను కొనసాగించవద్దని కోరారు. అనధికార నిర్మాణాలకు సంబంధించి న్యాయస్థానాల్లో ఉన్న పెండింగు కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని కోరారు.



# ఘనంగా మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



**మెళియాపుట్టి, డిసెంబర్ 11 (వార్త):** వైఎస్ఆర్‌సీపీ నాయకులు మామిడి శ్రీకాంత్ జన్మదిన సందర్భంగా మెళియాపుట్టిలో ఆ పార్టీ నాయకులు కన్నబాబు, డాక్టర్ గణేష్, ఉర్లాన రుషి నేతృత్వంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు.

ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. అనం తరం కేక్ కట్ చేసి జన్మదిన వేడు కలను నిర్వహించారు. మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ ఆర్‌సీపీ నాయకులు పాడి అప్పారావు, ఉర్లాన రవికుమార్, తారకేశ్వరరావు, కిరణ్‌కుమార్ రెడ్డి, వెంకటరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**ఎల్ఎన్ పేట:** ఎల్ఎన్ పేట కస్తూర్బా పాఠశాల నందు బుధవారం మాజీ రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు మండల వైసీపీ నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి 300 మంది విద్యార్థులకు స్వీట్స్, బుక్స్ పంచిపెట్టారు.

కార్యక్ర మంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో అంబిక, పాఠశాల ఉపాధ్యాయులు సునీతలక్ష్మీ, స్వర్ణభవాని, నిర్మల, సాయి బాల, మాలతి, అరుణ, మండల వైసీపీ నాయకులు కిలారి వెంకటరమణ, లక్ష్మణరావు, అర్జునరావు, శ్రీనివాస్ పాణిగ్రాహి, పైల తవిటినాయుడు, కొల్ల అన్నంనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# టిడ్కో లబ్ధిదారులూ.. ఆందోళన వద్దు



**పలాస, డిసెంబర్ 11 (వార్త):** టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌లో రామకృష్ణ పురం, బొడ్డపాడు-2, తర్లకోట అర్బన్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు, టిడ్కో ఇళ్ల కేటాయింపులకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా అర్బన్ లేఅవుట్లలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు, ఇసుక వంటి సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 9 దరఖాస్తులు రాగా, వివిధ శాఖాధికారులతో కమిషనర్ నడిపేన రామారావు మాట్లాడి పరిష్కార మార్గాలను సూచించారు. టిడ్కో ఇండ్లకు సంబందించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉందని, ఆ సొమ్మును డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ తెలిపారు. అర్బన్ హౌసింగ్‌కి సంబంధించి సొంత స్థలాలు, లే అవుట్ల లో ఇళ్లు నిర్మించే వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.



## మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుదాం

**కోటబొమ్మాళి, డిసెంబర్ 11 (వార్త):** మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుదామని కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, విక్టర్ జూనియర్ ప్రైవేటు కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం ఆయన కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో యువత మేలుకో, మాదకద్రవ్యాల వినియోగం వద్దు... సంతోషకరమైన జీవితం ముద్దు అంటు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించి మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదవ ద్రవ్యాలు వినియోగంతో శారీరక సమస్యలు, గుండె జబ్బులు ఎక్కువగా వ్యాప్తి చెంది మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని, తల్లిదండ్రులు మైనర్లు అయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాలు ఇస్తే ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగాలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అల్ యూసుఫ్ ఎంటర్ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన యువతకు సౌదీ అరేబియాలో గల పునరావాస కేంద్రాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువత ఈనెల 15వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆయా అభ్యర్థులకు ఈనెల 18వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల మధ్య గల ఉండి, ఏదైనా హాస్పిటల్ నందు కనీసం ఏడాదిన్నర పాటు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు సౌదీ అరేబియా దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని, కనీస వేతనం రూ.78,000 నుంచి రూ.89,000 వరకు ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా సర్టిఫికేట్లు, పాస్‌పోర్ట్, ట్రాన్స్క్రిప్ట్ సర్టిఫికెట్, జనన ధృవీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధృవీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్, కోవిడ్, ఎంఎంఆర్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ముందుగా https://forms.gle/XoY8SHAda ZCtugb1A లింక్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. skillinternational@apssdc.in మెయిల్ ఐడీకి అప్‌డేట్ చేసిన రెజ్యూమ్ పంపించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఈ నంబర్లను 9988853335, 9550967353, 7780167645 సంప్రదించాలని ఆయన కోరారు.

## భూ సమస్యలు పరిష్కరిస్తాం

**సంతబొమ్మాళి, డిసెంబర్ 11 (వార్త):** భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని సంతబొమ్మాళి మండల తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నౌపడ టీడీపీ యువ నాయకులు సుగ్గు స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూ సర్వేలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఏ రైతు నష్టపోకుండా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నూరు బాబ్జీ, వాడరేవు కృష్ణారావు, కర్రి బాలకృష్ణ, మండల సర్వేయర్ సుభాష్, ఆర్ఐ ప్రసన్నలత, వీఆర్వో మంగులు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546